
# ఆమె



డా॥ టి. 'కళ్యాణి' సచ్చిదానందం

ఆమె బస్టాండ్ దగ్గర చెట్టు క్రింద నిలబడి దిక్కులు చూస్తున్నది. చింపిరి జుట్టు, చిరిగిన జాకెట్టు, అస్తవ్యస్తంగా కట్టిన చీర, దేన్నో వెతుకుతున్నట్లు చంచలంగా కదులుతున్న కళ్లు చూపరులను 'ఇట్టే' ఆకర్షిస్తాయి. రోడ్డుమీద నడిచే జనం ఒక్క క్షణం ఆమెవైపు వింతగా చూసి చూపులు మరల్చుకుంటున్నారు. 'పాపం! పిచ్చిది!' అనుకుంటూ బడిపిల్లలు నవ్వుకుంటూ తిరిగి, తిరిగి చూస్తూ వెళుతున్నారు.

బస్టాప్‌కు కొద్ది దూరంలో రోడ్డు ప్రక్కగా ఆగివుంది ముచ్చటగా మెరుస్తున్న పసుపురంగు జెన్! ఆ కారు డోర్ వానుకుని సిగరెట్ కాలుస్తూ ఆమెవైపే పరిశీలనగా చూస్తున్నాడు రాఘవ!

'సందేహం లేదు! ఆమే! కానీ ఎందుకిలా అయిపోయింది? దగ్గరకు వెళ్లి పలకరిస్తేనో!' ఎటూ నిశ్చయించుకోలేక పోతున్నాడు.

అంతలో ఆమె చెట్టు క్రింద నుండి కదిలింది. నెమ్మదిగా ముందుకు సాగిపోతున్నది. రాఘవ ఏదో నిశ్చయానికి వచ్చినట్లు గబగబ నడిచి ఆమెను చేరుకున్నాడు.

"టీచర్! వసుధా టీచర్!" అంటూ పిలిచాడు.

ఆమె బెరుకుగా అతనివైపు చూసింది. "ఎవరు నువ్వు? పో!దూరంగా పో!" అని అరుస్తూ రోడ్డు మధ్యకు పరుగెత్తి ఎదురుగా వస్తున్న జీపు క్రింద పడిపోయింది. రెప్పపాటులో జరిగిపోయిన అనర్థానికి నిశ్చేష్టుడయ్యాడు రాఘవ! వెంటనే తేరుకుని దగ్గరకు వెళ్లేసరికి ఆమె రక్తపు మడుగులో పడివుంది. పోలీసు, జనం గుంపు కూడుతున్నారు. జీవుమాత్రం ఆగకుండా దూసుకుపోయింది ముందుకు! "మతిలేని మనిషి రోడ్డుకడ్డంగా ఎట్లా పరుగెత్తుకు వచ్చేసిందో! తప్పుకోండయ్యా! తప్పుకోండి "పోలీసు జనాన్ని అదిలిస్తున్నాడు.

"సార్! ఆమె నాకు తెలుసు! నేను హాస్పిటల్‌కి తీసుకు వెళతాను. అంబులెన్స్ రావడానికి ఆలస్యం కావచ్చు. కాస్త సహాయం చేయండి." పోలీసు

చేతిలో వందరూపాయల నోటుంచుతూ అన్నాడు రాఘువ. నోటును జేబులో వుంచుకుంటూ "మీ వాళ్లేనా! మతిలేని మనిషి కదా, కాస్త జాగ్రత్తగా చూసుకోవాలి సార్! రోజూ నేను చూస్తూనే వుంటాను. ఆ రోడ్డెంబడే నడిచిపోతుంది. ఎప్పుడూ ఇలా అడ్డం పరుగెత్తుకు రాలేదు. జాగ్రత్త సార్" అంటూ కార్లో చేర్చడానికి సహాయం చేసాడు ట్రాఫిక్ పోలీసు. "చాలా థాంక్స్!" అంటూ కారు స్టార్ట్ చేసాడు రాఘువ.

'తను పలకరించకపోతే ఈ అనర్థం జరిగి వుండేది కాదేమో!' తన జీవితం బాగు పడాలని కోరిన ఆమె జీవితం అంతం కావడానికి దోహదం చేసాడా తను చివరికి. బాధతో నుళ్లు తిరిగింది హృదయం. అది సహజమే! ఆ ఇద్దరి మధ్య వున్న అనుబంధం అంతటి బలమైనది. అందుకు పునాది పదిహేనేళ్ల క్రితం....

చింతపల్లి హైస్కూల్‌లో సైన్స్ టీచర్ వసుధ అంటే పిల్లలందరికీ గౌరవం, అభిమానం. ఏని మిదో తరగతి చదివే రాఘువకు ఆమె గురువే కాదు దైవం కూడా. అంతటి భక్తి గౌరవాలు ఆ చిన్నారి మనస్సులో పాదుకోవడానికి తన కుమార్తె మమతతో పాటు ఆమె అతనికి పంచి పెట్టిన ప్రేమానురాగాలే కారణం. పదో తరగతి పాసై ఆ వూరు వదిలే వరకూ రాఘువ కూడ వాళ్లింట్లో ఒకడుగానే మసిలాడు. 'మై ఏమ్ ఇన్ లైఫ్' మీద నీవు రాసిన వ్యాసం చాలా బాగుంది రాఘువా! ఇంజనీరువై పెద్ద పెద్ద కట్టడాలు కట్టాలన్నదే నీ కోరిక అన్నావందులో. అయితే ఆ లక్ష్య సాధనకు తగిన కృషి చేయాలి సుమా! లేకపోతే ఆశయం ఆశయంగానే వుండిపోతుంది. మాథ్స్‌లో నీవింకా బాగా కృషి చేయాలని మాలతీ టీచర్ చెప్పింది నాతో. నీ తెలివి తేటల మీద నాకు చాలా నమ్మకం వుంది. బాగా చదివి, తప్పకుండ నీ లక్ష్యం సాధిస్తావు అంటూ వెన్ను తట్టి ఆప్యాయంగా ప్రోత్సహించేది.

'ఆమె దీవెనతోనే కదూ తను ఇంజనీరై పద్ద బిల్డర్‌గా ఈనాడు పేరు తెచ్చుకున్నది. కాని ఆ ఆశయ సాధనలో తను వాళ్లకు చాలా దూరం అయిపోయాడు. ఇన్నేళ్ల తర్వాత ఇప్పడిలా కలుసుకోవడం...' అనుకున్నాడు భారంగా.

హాస్పిటల్‌లో చేర్చి, రక్తం అవసరమంటే తన రక్తం ఇచ్చి ఆమె కోలుకోవడానికి శాయశక్తులా పాటుపడుతున్నాడు రాఘువ.

పదిరోజులు గడిచిపోయాయి. ఇంకా సరిగ్గా స్పృహలోకి రాలేదు ఆమె. ఆరోజు సాయంత్రం తను వచ్చేసరికి బెడ్ ప్రక్కన కుర్చీలో కూర్చుని కళ్లు వత్తుకుంటున్న మునలాయన వైపు ఆశ్చర్యంగా చూస్తూ "ఎవరండీ మీరు?" అడిగాడు రాఘువ.

"ఆమె అన్నను బాబు!" అన్నాడాయన వణికే గొంతుతో.

"అన్నా! నాకు తెలిసినంత వరకు వసుధ టీచర్‌కి బంధువులెవరూ లేరు ఒక్క పాప మమత తప్ప. మీరన్న అయితే ఈ విషయం చెప్పండి ముందు. ఆమె ఎందుకిలా అయిపోయినారు? మమత ఇప్పడెక్కడుంది? ప్లీజ్! చెప్పండి!" ఉద్వేగంగా ప్రశ్నించాడు రాఘువ.

"చెబుతాను బాబూ! చింతపల్లిలో టీచర్ వుద్యోగం దొరికి, పదేళ్ల కూతురితో అక్కడకు వెళ్లిపోవడానికి ముందు వసుధకు నామమా త్రపు అన్నగా నేను, త్రాగుబోతు భర్త సూర్యం, సాధింపులతో సంసారం నరకం చేసిన అత్తా, ఆడబడుచు–అందరూ బంధువులే. జీవితంలో ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా చలించేది కాదు వసుధ. ఆమెకు కూతురంటే పంచప్రాణాలు. ఆ పిల్లకోసమే నడుం బిగించి అన్ని కష్టాల్లో కూడా ప్రైవేటుగా చదువుకుని తన కాళ్లమీద తను నిలబడే స్థితికి ఎదగాలనుకుంది. అలాగే ఎదిగింది. తాగుడుతో ఆరోగ్యం చెడి భర్త అకాలమరణానికి గురవడం, అత్తగారి సాధింపు ఆమె సహనానికి పరీక్ష పెట్టాయి. అప్పడే వచ్చింది చింతపల్లిలో వుద్యోగం. ధైర్యంగా ఎవరికి చెప్ప కుండ పిల్లను తీసుకు వెళ్లిపోయింది. ఎన్నో ఏళ్ల తర్వాత నాకు జాబు రాసింది త్వరలో తను రిటైర్ కానున్నట్లు, మమత వైజాగ్‌లో మెడిసన్ చదువు కుంటున్నట్లు. నేనేం సహాయం చేయలేకపోయినా తోబుట్టువు జీవితం బాగుపడిందని సంతోషిం చాను. కానీ ఆ ఆనందం ఎక్కువకాలం నిలవలేదు బాబు!" అంటూ దుఃఖోద్వేగం ఎక్కువ కావడంతో కండువాలో ముఖం దాచుకున్నాడాయన.

సానుభూతిగా ఆయనవైపు చూస్తూ ఆత్రంగా ప్రశ్నించాడు రాఘువ.

"ఆ తర్వాతేమైంది? చెప్పండి సార్!" అంటూ.

"ఏమని చెప్పేది బాబు! హాస్టల్‌లో వుండి చదువు కుంటున్న మమత తోటి స్టూడెంట్స్‌తో ఎక్స్‌కర్షన్‌కు వెళ్లి ఎవరో దుర్మార్గుడి చేతిలో అత్యాచారానికి బలై మరణించిందట. ఆ విషయం తెలిసిన



వసుధ మనస్సు ముక్కలైపోయింది. మతి స్థిరం తప్పి ఆమె పరిస్థితి నానాటికి దిగజారిపోసాగింది. విషయం తెలిసిన నేను వుండబట్టలేక ఈ మధ్యే తీసుకువచ్చి వైద్యం చేయిస్తున్నాను. కొద్దిగా తేరు కుంటున్నది. మా వీధి మొదట్లో బడి వుంది, ప్రొద్దున్నే వెళ్లి అక్కడ చెట్టు నీడలో నిలబడి ఏదో మాట్లాడుకుంటూ వుంటుంది. తనకు తోచిన ప్పడు మెల్లగా నడుచుకుంటూ వచ్చి ఇంటిముందు అరుగుమీద కూర్చుని వుంటుంది. ఎవరితో మాట్లా డదు. ఆరోజు మామూలుగా ఇంటికి రాకపోతే కంగారుపడి ఎంతగానో వెతికాను. చివరకు ఆక్సి డెంట్ అయితే ఎవరో కార్లో తీసుకు వెళ్లారని చెప్పాడు పోలీసతను. అతికష్టం మీద ఇవాల్టికి కనుక్కోగలిగాను ఇక్కడ వున్నట్లు!"

ఆయన చెప్పిందంతా విన్న రాఘువ గుండె బరువెక్కి పోయింది.

"ఎంత ఘోరం జరిగిపోయింది! క్షణికోద్రేకానికి లోనై యుక్తా యుక్త విచక్షణ లేని ఒక పశువు చేతిలో మమత బలై పోవడం టీచర్‌కి ఇలా మతి స్థిరం తప్పడం– అంతా విధికృతం అనుకోవడం కంటే మనం చేయగలిగిందేముంది? అయినా నేను ధైర్యం కోల్పోవడం లేదు. మీరు దిగులు పడకండి సార్. ఆమె బాధ్యత ఇకపై పూర్తిగా నాది." అన్నాడు రాఘువ దృఢంగా.

మునలాయన కళ్లలో కృతజ్ఞత పెల్లుబికింది.

మంచం మీద పడుకుని వున్న వసుధలో మెల్లగా కదలిక వచ్చింది. కళ్లు తెరిచి చుట్టూ చూస్తున్నది. ఎవరికోసమో వెతుకుతున్నట్లుగా. రాఘువ దగ్గరకు వచ్చి ఆ కళ్లలోకి సూటిగా చూస్తూ నిలబడ్డాడు మౌనంగా. ఆమె కళ్లు క్రమంగా కాంతివంత మయ్యాయి. చప్పున అతని చేయి పట్టుకుంటూ "రాఘువా! నువ్వేనా! అవును, నువ్వు నా రాఘు వవే! నువ్వు మంచివాడివి నిజం చెబుతావు. చెప్ప. మమత బతికే వుందిగదూ! చెప్పు! బతికే వుందని చెప్పు!" అన్నది క్షీణస్వరంతో.

"అవును టీచర్! నిజమే చెబుతున్నాను వినండి. మమతకు చావులేదు. మంచి మనస్సున్న మీ అణువణువులో మమత నిండివుంది. ఎప్పటికీ జీవించే వుంటుంది" అన్నాడు ఆమె చెవి దగ్గరగా వంగి.

ఆ మాటలు అమృతపు ధారలా తాకాయి బీడు వారిన మనస్సును.

ఆమె కళ్లు తృప్తిగా మూసుకున్నాయి. ఆమె చేతిని సున్నితంగా రాస్తూ వుండిపోయాడు రాఘువ!

'చెల్లాయి దగ్గర చదువుకున్న కుర్రాడై వుంటాడు. అతని కళ్లలో ఆమెపట్ల ఎంతటి భక్తి, ఆరాధన వెల్లి విరుస్తున్నాయో! ఇక తను దిగులు పడనక్కరలేదు. ఇంతమంచి శిష్యుడిని పొందిన ఆమె జీవితం ధన్యం!'

అనుకుంటూ తృప్తిగా నిట్టూర్చాడు ఆమె అన్న!!